# రుణమాఫీపై భగ్గుమన్న ఆదిలాబాద్


ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

## రేవంత్ దిష్టిబొమ్మతో శవయాత్ర

ఆదిలాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): రూ.రెండు లక్షల రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండోరోజైన ఆదివారం కూడా రైతుల ఆందోళనలు కొనసాగాయి. జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం కేంద్రంతోపాటు తలమడుగు మండలం రుయ్యాడి, బేల మండలం సిర్సన్న, భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బజార్‌హత్నూర్, రుయ్యాడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో డప్పుచప్పుళ్ల నడుమ పటాకులు కాలుస్తూ శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. సిర్సన్న, పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

**లోకం పోకడ**



మాకు ఓట్లేసి గెలిపించినందుకు మీ'రుణం' ఎప్పటికీ తీర్చుకోలేం రైతన్నా!

## రుణమాఫీ కాలే..ఎవరు ఏట్లో దూకాలి?

### సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్న



హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులే రుణమాఫీ కాలేదు అంటున్నరని, దీన్ని బట్టి ఎవరు రాజీనామా చేయాలి? ఎవరు ఏటిలో దూకి చావాలో.. ఎవరికి చీము నెత్తురు లేదో.. ఎవరు అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు భూమికి రాయాలో..ఎవరు రాజీనామా చెయ్యాలో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. రాష్ట్రంలో పాక్షికంగా మాత్రమే రుణమాఫీ జరిగింది.. కోదండరెడ్డి, కోదండరాంరెడ్డి, ఆది శ్రీనివాస్ ముగ్గురూ రుణమాఫీ సంపూర్ణంగా కాలేదని చెప్తున్నదే తానూ చెప్పానని ఆయన స్పష్టం చేశారు. రూ. 31 వేల కోట్లు అని చెప్పి రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారు అని తాను అంటే రంకెలెందుకు వేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ అయి ఉంటే రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు రోడ్డెక్కి నిరసనలు తెలియచేస్తున్నారని, సీఎం దిష్టిబొమ్మలు ఎందుకు దహనం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రతీ అంశాన్ని రాజకీయకోణంలో చూడటం, తొండి చేసైనా గెలిచామనే వైఖరి ప్రదర్శించడం అవివేకమే అవుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి కండ్లు తెరిచి, రుణమాఫీ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసి రైతులందరికీ న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# రుణమాఫీ ఎగ్గొట్టాలనే దురాలోచన

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్
- గోడు వెళ్లబోసుకున్న కందగట్ల రైతులు

సూర్యాపేట, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): రైతుల రుణమాఫీ డబ్బు ఎగ్గొట్టాలనే దురాలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామంలో ఓ కార్యకర్త ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే వద్దకు గ్రామానికి చెందిన 25 మంది రైతులు చేరుకొని తమకు రుణమాఫీ కాలేదని గోడు వెళ్లబోసుకున్నారు. బ్యాంకుల్లో తమకు రూ.2 లక్షల లోపు మాత్రమే అప్పు ఉన్నదని, అయినా మూడు విడుతల్లోనూ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీపై సీఎం బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేసి వివరాలు సేకరించారని, 50 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.49 వేల కోట్ల రుణాలు ఉన్నట్టు బ్యాంకర్లు చెప్పారని తెలిపారు. అన్ని చేయలేమనే భయంతో రూ.39 వేల కోట్లే అంటూ తొలి నుంచి ప్రచారం చేశారని గుర్తు చేశారు. అనంతరం రూ.31 వేల కోట్లు అని క్యాబినెట్‌లో తీర్మానం చేసి తీరా బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు అన్నారని చెప్పారు. బడ్జెట్ సందర్భంగా ఆ రోజు బీఆర్‌ఎస్ తరఫున తాము మాట్లాడే సందర్భంలో రూ.26 వేల కోట్లతో నూరుశాతం మాఫీ ఎలా చేస్తారని ప్రశ్నించినా వారి నుంచి స్పందన కరువైందని చెప్పారు. తీరా చూస్తే మూడు విడుతలు కలిపి 20 లక్షల మంది రైతులకు రూ.17,900 కోట్లే మాఫీ చేసినట్టు ప్రకటించారని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు అధికారులకు దరఖాస్తు పెట్టుకోమంటున్నారని, అధికారుల వద్దకు వెళ్లి బల్లకింద చెయ్యిపెట్టే పరిస్థితి వస్తదని విమర్శించారు.


కందగట్లలో తమ రుణాలు మాఫీ కాలేదని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి చెబుతున్న రైతులు

## 45% మందికే రుణమాఫీ!

**మిగతా 55 శాతం రైతులకు టోకరా ● మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**



కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 18: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని కేవలం 45 శాతం మంది రైతులకే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రటకనలో విమర్శించారు. మిగతా 55 శాతం మందిని మోసం చేసిందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబర్ 9నే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి.. రైతులను నిండా ముంచారని ఆరోపించారు. ప్రభుత్వం మొదట రూ.41 వేల కోట్లు రుణమాఫీకి అవసరమని చెప్పి, క్యాబినెట్ భేటీలో రూ.31 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొని, ఇప్పుడు 8 నెలల తర్వాత కేవలం రూ.17 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.


అగ్రిషోను సందర్శిస్తున్న మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

## రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు మోసం

### వ్యవసాయ శాఖమాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నీలగిరి, ఆగస్టు 18: రుణమాఫీలో కాంగ్రెస్ సర్కారు రైతులను మోసం చేసిందని, అందరికీ అని చెప్పి కొందరికే వర్తింపజేశారని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేయడంలో పోటీలు పడుతున్నాయని విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం అగ్రిషోలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రైతు జీవితం అందరినీ నమ్మడం, మోసపోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ రుణమాఫీ వరకు రైతుది అదే కథ అని చెప్పారు. రుణమాఫీ కాని రైతుల నుంచి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, వెంటనే రెండు లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిలింగయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, అగ్రిషో నిర్వాహకుడు జూలకంటి రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## త్వరలో అర్హులను పెంచుతారట!

### అన్నదాతల ఆందోళనతో పొంగులేటి బుజ్జగింపు ప్రకటన



పరకాల, ఆగస్టు 18 : అధికారంలోకి రాగానే ఒకేసారి 2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రుణరైతులు 70లక్షల మంది ఉంటే.. మూడు విడతల్లో కేవలం 22 లక్షల మందికే రుణమాఫీ వర్తింపజేసి వందశాతం పూర్తిశామని చేతులు దులుపుకొన్నది. కేవలం 40శాతం మందికే రుణమాఫీ వర్తించగా, ఇంకా మాఫీ కాని లక్షలాది రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవడం, ఇటు రైతులు కోపంతో రోడ్డెక్కి నిరసనలకు దిగడంతో వారిని శాంతపరిచేందుకు ఓ మంత్రివర్యులు తాజాగా మరో ప్రకటన చేశారు. త్వరలో రుణమాఫీ కోసం అదనంగా మరో 12 వేల కోట్లు మంజూరు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ భవనంలో అభివృద్ధి పనులు, డిగ్రీ కళాశాలకు ఆదివారం శంకుస్థాపన చేసిన సందర్భంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఇప్పటికే రుణమాఫీకి రూ.19 వేల కోట్లు మంజూరు చేశామని, అదనపు నిధులు త్వరలో మంజూరు చేసి అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అరకొరే రుణమాఫీ అయిందన్న విషయం పొంగులేటి ప్రకటనతో తేటతెల్లమైందని విపక్షాలు స్పష్టంచేస్తున్నాయి.


జనగామ జిల్లా దేవరుప్పుల బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## రుణమాఫీలో సర్కారు విఫలం

- రాష్ట్రంలో సగం మందికే రుణమాఫీ
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఆగస్టు 18: రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధ్వజమెత్తారు. రుణమాఫీని ఎగ్గొట్టి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హుల్లో కేవలం 47 శాతం మందికే రుణమాఫీ జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ లెక్కల్లో రూ.49,500 కోట్ల అప్పులు ఉన్నట్టు తేలగా, క్యాబినెట్ మీటింగ్‌లో రూ.31 వేల కోట్లని తేల్చి, బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు కేటాయించి, తీరా మూడు విడుతల్లో రూ.17 వేల కోట్లకే రుణమాఫీ చేశారని చెప్పారు. రుణమాఫీ కాని లక్షలాది మంది రైతులు రోడ్డెక్కితే ఈ ప్రభుత్వం ఉంటుందా? అని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ఎన్నాళ్లుంటుందో చెప్పలేమని తేల్చి చెప్పారు. సమావేశంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ● బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


రుణమాఫీ జరగలేదని ఆందోళన నిర్వహించే అవకాశమున్నదని నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్టు చేశారు. వారి ఇండ్లకు చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. రైతులకు రుణమాఫీ అయ్యేంత వరకు పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు.
–ఇందల్వాయి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

## రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి

- బూటకపు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆఫీసుపై దాడి సిగ్గుచేటు
- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

కామారెడ్డి, ఆగస్టు 18: రుణమాఫీని పూర్తిగా అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండ్ చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా 30 నుంచి 40 శాతం మంది రైతులకు మించి రుణమాఫీ కాలేదని తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఓట్ల కోసం దేవుళ్లందరిపై ఒట్టేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధికారం వచ్చాక ఆ ఒట్లనే మరిచారని ధ్వజమెత్తారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కార్యాలయంపైకి గూండాలను పంపి దాడులు చేయించారని, దానికి పోలీసులు వత్తాసు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారిపోయాయని ఆరోపించారు. దేశంలో అతి తక్కువకాలంలోనే సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేస్థాయికి దిగజారిన ఏకైక వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు.

## రుణమాఫీపై 60వేల ఫిర్యాదులు

- హెల్ప్‌డెస్క్‌ల వద్దకు భారీగా రైతులు
- అధికారుల వద్ద అంతకుమించి ఫిర్యాదులు

హైదరాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రుణమాఫీ కాలేదని ఇప్పటివరకు ఏకంగా 60వేల ఫిర్యాదులు వచ్చినట్టుగా తెలిసింది. ఇవి కేవలం హెల్ప్‌లైన్ డెస్క్‌ల వద్ద వచ్చిన ఫిర్యాదులే కావడం గమనార్హం. ఇంకా ఏఈవోలు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద వచ్చిన ఫిర్యాదులు అంతకుమించి ఉన్నట్టు తెలిసింది. సర్కారు అడ్డగోలు కోతలకు తోడు చిన్న చిన్న కారణాలు, సాంకేతిక సమస్యలతోనూ అర్హులైన రైతులకు రుణమాఫీ కావడం లేదు. ఆధార్‌లో అక్షరం తప్పుందని, పేరు సరిగ్గా లేదని, రేషన్‌కార్డు లేదని ఇలా అనేక కారణాలతో చాలామంది అర్హులు రుణమాఫీకి దూరమయ్యారు. ఈ రైతులంతా అధికారుల వద్దకు పరుగులు తీసి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇవి ఎంత వరకు పరిష్కారమవుతాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది.

## వజ్జపల్లితండాలో సీఎం దిష్టిబొమ్మ దహనం

రామారెడ్డి, ఆగస్టు 18: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి రైతులను మోసం చేశారని కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం వజ్జపల్లితండా గిరిజన రైతు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ చేయనందుకు నిరసనగా తండా రైతులు గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆదివారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గ్రామంలో చాలా మందికి రుణమాఫీ కాలేదని, రేవంత్‌రెడ్డి.. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రుణమాఫీ చేయకపోతే బ్యాంకులు, వ్యవసా య కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రైతు గోస విను రాహుల్

మొదటిపేజీ తరువాయి...

మేరకు వారికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. మూడు దశల్లో కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే వందశాతం పూర్తయిందని ప్రకటించడం అబద్ధమని మండిపడ్డారు. రుణమాఫీ పేరిట తెలంగాణలో నయవంచన జరిగిందని ఆధారాలను లేఖలో పొందుపర్చారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను లేఖలో ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల దగాపడ్డ లక్షలాది మంది రైతుల తరపున లేఖ రాస్తున్నానని వివరించారు. ప్రభుత్వం వైఫల్యాలను కూడా గొప్పగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసంతో లక్షలాది మంది రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని చెప్పారు. రైతు రుణమాఫీ విషయంలో వరంగల్ రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రాణప్రతిష్ఠగా స్వీకరించి, దాని అమలును ఏ స్థాయిలో పాతరేసిందో లేఖలో వివరించారు.

> **మూడు దశల్లో కనీసం 40 శాతం కూడా రుణమాఫీ పూర్తిచేయకుండానే 100శాతం పూర్తయిందని ప్రకటించడం వందశాతం అబద్ధం. రుణమాఫీ పేరిట తెలంగాణలో నయవంచన జరిగింది. -కేటీఆర్**

### రూ.49,500 కోట్లు ఎక్కడ?

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్ష రుణమాఫీ చేస్తేనే రూ.17 వేల కోట్లు ఖర్చయిందని, 36 లక్షల మంది రైతులు రుణవిముక్తులయ్యారని కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ చెబుతున్నట్టు 2 లక్షల రుణమాఫీ పూర్తయితే లబ్ధిదారుల సంఖ్య, రుణమాఫీ మొత్తం రెట్టింపు కావాలని, కేవలం రూ.17,900కోట్లతో రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామనడం ముఖ్యమంత్రి డొల్లవాదనకు నిదర్శనమని అభివర్ణించారు. 47 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికి నామమాత్రంగా చేయడం కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు నిలువుటద్దమని నిప్పులు చెరిగారు. లక్ష రుణమాఫీ కన్నా 2 లక్షల రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్య 14 లక్షలు తగ్గడం మాఫీ విఫలమైందనేందుకు సంకేతమని చెప్పారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ రూ.2 లక్షల రుణమాఫీకి రూ.49,500 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిందని గతంలో రేవంత్‌రెడ్డి స్వయంగా రుణమాఫీకి రూ.40 వేల కోట్ల వరకు అవసరమవుతాయని పేర్కొన్న విషయాన్ని కేటీఆర్ ఉదహరించారు. 'కడుపు కట్టుకుంటే ఇది పెద్ద విషయం కాదు' అని ఇంటర్వ్యూల్లో రేవంత్‌రెడ్డి చెప్పిన గొప్పలను ఏకరువు పెట్టారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రుణమాఫీని రూ.31 వేల కోట్లకు కుదించారని, చివరికి అందులోనూ కోత పెట్టి బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లే కేటాయించారని వివరించారు. మూడు విడతల రుణమాఫీ తతంగాన్ని రూ.17,933 కోట్లతో సరిపెట్టారని విమర్శించారు. రూ. 49,500 కోట్లని చెప్పి మూడింతలు తగ్గి రూ. 17,933కోట్లతో చివరికి 40 శాతం కూడా రుణమాఫీ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి లక్షలాది మంది రైతులను ముంచారని మండిపడ్డారు. కడుపుమండిన రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు.

> **రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసంపై లక్షలాది మంది రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నరు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై ఆగ్రహంతో ఊగిపోతున్నరు. దగాపడ్డ రైతుల తరపున నేను ఈ లేఖ రాస్తున్నా.. -కేటీఆర్**

### కాంగ్రెస్ మోసంతో రైతుల ఆక్రందన

కాంగ్రెస్ చేసిన మోసానికి రైతాంగం ఆందోళన బాటను ఎంచుకున్నదని కేటీఆర్ ఉదహరించారు. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్‌లో రుణమాఫీ కాని అన్నదాతలు రోడ్డెక్కారని, మంచిర్యాలలో రుణమాఫీ కాలేదన్న మనస్తాపంతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. కరీంనగర్ రాజీవ్ రహదారిపై అన్నదాతలు రాస్తారోకో చేసి 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారని వివరించారు. మొలంగూరు ఇండియన్ బ్యాంకు ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారని, రుణమాఫీ కాని రైతులు వనపర్తిలో రైతు వేదిక సాక్షిగా 'అబద్ధాల ముఖ్యమంత్రికి పాలించే హక్కు లేదు' అని నిప్పులు చెరుగుతున్న వైనాన్ని లేఖలో కేటీఆర్ ప్రస్తావించారు. జగిత్యాల సహా రాష్ట్రమంతా రైతన్నల నిరసనతో అట్టుడుకుతున్నదని ఉదహరించారు. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి మోసం చేసిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం ఆగ్రహంతో ఊగిపోతున్నదని చెప్పారు.

### సర్కార్ వైఖరి మారేదాకా పోరాటం ఆగదు

అప్పుల బాధ భరించలేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగోలు ఆంక్షలు, అర్థంలేని షరతులతో రుణమాఫీని రేవంత్ సర్కార్ ప్రహసనంగా మార్చిందని మండిపడ్డారు. రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నదని చెప్పారు. తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్‌కు కేవలం వారం వ్యవధిలోనే 1,20,000కు పైగా ఫిర్యాదులు అందిన విషయాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ సర్కారు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ దిగొచ్చేదాకా తమ పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు.

## బస్సుల సంఖ్య ఎందుకు పెంచరు?

### సర్కార్‌కు కేటీఆర్ సూటి ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): ప్రయాణికుల రద్దీని పరిగణనలోకి తీసుకొని బస్సుల సంఖ్యను ఎందుకు పెంచడం లేదని సర్కార్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. 50 మంది ఎక్కాల్సిన బస్సులో 170 మంది ఎక్కినందుకు నిర్మల్ డిపో బస్సు రెండు టైర్లు ఊడిపోయి ప్రయాణికులు పడ్డ అవస్థలను ఆదివారం ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు. 'అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ ఏమీ కాలేదు.. జరగరానిది జరిగితే బాధ్యులెవరు?' అంటూ ఆవేదన చెందారు.

### నేడు ఆడబిడ్డలకు అందుబాటులో కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 18 (నమస్తే తెలంగాణ): సోమవారం ఉదయం 11 గంటల నుంచి తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులకు కేటీఆర్ అందుబాటులో ఉండనున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆడబిడ్డల సమక్షంలో వేడుకలు నిర్వహించుకోనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.